క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న యాజమాన్యం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నారాయణ ఐఐటీ క్యాంపస్ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఐఐటీ ఫలితాల్లో వేయిలోపు ర్యాంకులను సాధించారు.శివ 211 ర్యాంకు, సర్వజిత్ 286, ఆర్నా 363, కేత్‌రెడ్డి 452, సాయి సింధూష్ 624, మనీష్‌రెడ్డి 737 ర్యాంకులను సాధించిడం పట్ల ఈ సందర్భంగా కళాశాల్లో అధ్యాపక బృందం తోటి విద్యార్థులు కేకు కట్ చేసి ఘనంగా సన్మాంచారు. బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో కోర్‌డీన్ కె.వెంకట్‌రెడ్డి, డీన్ శ్రీనివాస్, ఏజీఎం శ్రీనివాస్, కేశవరెడ్డి, ప్రిన్స్‌పాల్‌లు జ్యోతిష్‌రెడ్డి, వినయ్‌కుమార్, సతీష్, సైదులు, ఏఓఎస్ సురేష్, రాజవర్ధన్ రెడ్డి, రఘుపతి, సంతోష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



సీతా ప్రనూషను సన్మానిస్తున్న కార్పొరేటర్ అర్జున్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీనిలయ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న సంతోష, కృష్ణ దంపతుల కుమార్తె సీతా ప్రనూష నీట్–2024లో 720 మార్కులకు గాను 640 మార్కులు సాధించింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్ కాలనీవాసులతో కలిసి సీతా ప్రనూషను అభినందించి సన్మానించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు చదివి డాక్టర్‌గా స్థిరపడి ప్రజలకు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనిలయ కాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట

తుక్కుగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జయశంకర్ బడిబాట కార్యక్రమం సోమవారం ఐదవ రోజుకు చేరుకుంది. మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల సిబ్బంది, ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి బడీడు పిల్లలను గురిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల వయస్సు పిల్లలను తల్లిదండ్రులు తప్పకుండా పాఠశాలకు పంపించాలని అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు అన్నదానం, పండ్ల పంపిణీ



విద్యార్థులకు ఆహార పదార్థాలను వడ్డిస్తున్న అశ్విని ఆంజనేయులు

వనస్థలిపురం: కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు తన జన్మదినాన్ని పురస్కరించుకుని వనస్థలిపురంలోని శాంతినికేతన్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు బాలేశ్వర్, బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పాండు యాదవ్, నాగరాజు, విజయ్‌కుమార్, నర్సింహులు, దేవేందర్, అరుణ్ కుమార్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

అదనపు నిధులు మంజూరు చేయాలి

ఎల్బీనగర్: ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని శివారు కాలనీలలో నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు.ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యే జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో 80కిలో మీటర్ల నూతన వాటర్ పైప్‌లైన్‌తో పాటు రూ.50కోట్లతో యూజీడి పైప్‌లైన్ పనులను నిధులు మంజూరు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శివారు కాలనీలలో యూజీడి పైప్‌లైన్ నిర్మాణం కోసం మరో రూ.20కోట్లు మంజూరు చేయాలని కోరామని వాటిని కూడా మంజూరు చేస్తే శివారు కాలనీలకు మేలు జరుగుతుందని తెలిపారు. నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎండీ పేర్కొన్నారన్నారు.

వేధిస్తున్న సబ్జెక్టు టీచర్ల కొరత

బడులు రేపు (బుధవారం) ప్రారంభం కానున్నాయి. ఆయా పాఠశాలల్లో ఇంకా మౌలిక వసతుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తుంది. పాఠ్యపుస్తకాల, నోట్ పుస్తకాలు, యూనిఫాంల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అధికారుల చెబుతున్నారు.. త్వరగా సూక్ష్మ పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- రేపు మోగనున్న బడిగంట
- స్వాగతం పలకనున్న సమస్యలు
- పలుచోట్ల ఇంకా పూర్తికాని అభివృద్ధి పనులు



కందుకూరులో పిల్లర్ల వరకే ఆగిన పాఠశాల గదుల నిర్మాణం

మహేశ్వరం: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా మహేశ్వరం మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలకు రూ.3.50 కోట్ల నిధులు గత ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని రావిర్యాల బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, తుక్కుగూడ ఉన్న త పాఠశాల, మంఖాల్ ప్రాథమిక పాఠశాల, మహేశ్వరం ప్రాథమిక పాఠశాల, మన్సాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల, మొహబ్బత్‌నగర్ ప్రాథమిక పాఠశాల, నాగారం ఉన్నత పాఠశాల, అమీర్‌పేట్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, తుమ్మలూరు ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన మొత్తం 10 పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. తుక్కుగూడ, మొహబ్బత్‌నగర్ రెండు పాఠశాలలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా ఉన్నాయని త్వరలో పూర్తి చేయిస్తామని ఎంఈఓ కృష్ణ చెప్పారు.

మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలలు

మండలంలో మొత్తం 56 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ఉన్నత పాఠశాలలు–14, ప్రాథమిక పాఠశాలలు–29, ప్రాథమికోన్నత పాఠశాలలు–11, కస్తూర్బాగాంధీ పాఠశాల, మోడల్ స్కూల్ ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా 170 మంది ఉపాధ్యాయులున్నారు. కొన్ని పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. సబ్జెక్టు టీచర్లు కా వాలని డీఈఓకు విన్నవించామని ఎంఈఓ తెలిపారు.

కొనసాగుతున్న పనులు

కందుకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడానికి మన ఊరు–మన బడి పథకం కింద 18 పాఠశాలలు ఎంపిక చేయగా, ప్రస్తుతం 8 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా వాటిల్లో రంగులు వేయడంతో పాటు కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ సమస్యతో పిల్లర్ల వరకే నిర్మాణం ఆగింది. ధన్నారంలో స్థలం కొరతతో అదనపు గది నిర్మాణం చేపట్టనేలేదు. మన ఊరు– మన బడి పథకం కింద ఎంపికైన పాఠశాలలకు గత ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేయించారు. మీర్‌ఖాన్‌పేట, నేదునూరు జెడ్పీ పాఠశాలల్లో అమేజాన్ సంస్థతో అభివృద్ధి పనులు చేయించారు. కాగా, మిగిలిన పాఠశాలల్లోని పనులను అమ్మఆదర్శ పాఠశాల కమిటీలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఒక్కో పాఠశాలకు రూ. 1లక్ష కేటాయించి పనులు చేపట్టింది. మరుగుదొడ్లు, తాగునీరు, కరెంట్ పనులు, చిన్న చిన్న మరమ్మతులు చేపడుతున్నారు. చాలా పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. మొత్తం 53 పాఠశాలల్లో 4728 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఇంకా పూర్తి కావాల్సి ఉంది



మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పాఠశాలల్లో కొన్ని మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇంకా పూర్తి కావాల్సినవి ఉన్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేయాల్సిన పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం విద్యార్థులకు సరిపడా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. యూనిఫాం కూడా స్థానికంగానే మహిళా సంఘాలు కుడుతున్నారు. పాఠశాలలు ప్రారంభం కాగానే అందరికీ పంపిణీ చేస్తాం.

– టి.మనోహర్, ఇన్‌చార్జి ఎంఈఓ, కందుకూరు

కళాశాలకు భవనం కేటాయించరా?



ఒకే భవనంలో పాఠశాల, జూనియర్ కళాశాల

- ఒకే భవనంలో కాలేజీ, పాఠశాల
- పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు

మీర్‌పేట: పూర్తయిన కళాశాల భవనం కేటాయించేదెప్పుడు? పాఠశాల తరగతులు పూర్తిస్థాయిలో జరిగేదెప్పుడు? కార్పొరేషన్ పరిధిలోని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వివరాల ప్రకారం.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి సిర్లాహిల్స్‌లో ఒకే ఆవరణలో గతంలో ఉదయం పాఠశాల.. మధ్యాహ్నం జూనియర్ కళాశాల తరగతులు కొనసాగేవి. దీంతో పాఠశాల తరగతులు ఉ.8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే కొనసాగడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పిల్లల చదువులు సక్రమంగా సాగడం లేదని పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నా.. జూనియర్ కళాశాలకు భవనాన్ని నేటికీ కేటాయించకపోవడంతో ఇంకొన్ని రోజులు పాఠశాల తరగతులు మధ్యాహ్నం వరకే కొనసాగాల్సిందేనా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు తరగతులు బయటే..

ఒకే భవనంలో పాఠశాల, కళాశాల తరగతులు సాగడంతో పాఠశాల విద్యార్థులు గతంలో ఇబ్బందులు పడ్డారు. 1 నుంచి 7 తరగతులకు ఐదు గదులు మాత్రమే అందుబాటులో ఉండడంతో 1, 3వ తరగతులకు బయట కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి.

భవనం ప్రారంభం ఎప్పుడో?

జూనియర్ కళాశాల కోసం అత్యాధునిక హంగులతో పది తరగతి గదుల భవనాన్ని నిర్మించడం జరిగింది. భవన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా కళాశాలకు ఇంతవరకు కేటాయించలేదు. పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున భవనాన్ని త్వరితగతిన అప్పగించేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సిద్ధమైనా కేటాయించని జూనియర్ కళాశాల భవనం



పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా బయట కొనసాగనున్న తరగతి గది

త్వరలో భవనం అందుబాటులోకి

భవనం కేటాయింపు విషయమై ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారం రోజుల్లో కళాశాల భవనాన్ని అప్పగించడం జరుగుతుంది. దీంతో ఇకపై పాఠశాల, కళాశాల తరగతులు సరైన సమయంలోనే కొనసాగుతాయి.

– జి.సైదులు, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో) టమోటా లోకల్ 45, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 60, కాకర 45, బీర 55, క్యాలీఫ్లవర్28, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 18, ఆలు 33, ఉల్లి 34, గోకర 45, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 55, చిలగడదుంప 55, బీట్‌రూట్ 25, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 65. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

చరికొండకు బస్సు సర్వీసులు నడపండి

మంత్రి పొన్నంకు గ్రామస్తుల వినతి

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామం మీదుగా వివిధ గ్రామాలకు కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం చరికొండ గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ ప్రాంతంలో సకాలంలో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, రైతులు, కూలీలు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కల్వకుర్తి ఆర్టీసీ డిపో నుంచి అదనంగా రెండు బస్సులను చరికొండ మీదుగా రాకపోకలు సాగించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కల్వకుర్తి–ఆమనగల్లు, కర్కల్‌పహాడ్, ఎక్వాయిపల్లి, ముదీవ్రన్, చరికొండ, పల్లెచెలక, మేడిపల్లి, యాచారం వరకు నడపాలని, మరోబస్సును మాల్ నుంచి కొల్కుల్‌పల్లి, నాగిళ్ల, చరికొండ, ఆకుతోటపల్లి, ఆమనగల్లు, కల్వకుర్తి వరకు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చరికొండ ఎంపీటీసీ రాములుగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, రాజీవ్, మహేందర్‌గౌడ్, హరిచందర్, మహేశ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

అందుబాటులో పాఠ్యపుస్తకాలు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ అధికారులు చేపట్టారు. మండల పరిధిలో 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, 12 ప్రాథమికోన్నత పాఠశాలలు, 30 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 4728 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ప్రభుత్వం తరగతుల వారీగా సబ్జెక్టు, నోట్ పుస్తకాలను సరఫరా చేపట్టింది. మొదటి విడతలో దాదాపుగా 40 శాతం వరకు పుస్తకాలను ఆయా పాఠశాలలకు అధికారులు తరలించారు. నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ కాగా, కొన్ని తరగతులకు సబ్జెక్టు పుస్తకాలు అందాల్సి ఉంది. అందులో 7వ తరగతి ఫిజిక్స్, 10వ తరగతి హిందీ, సోషల్, రెండు, నాలుగు తరగతులకు సంబంధించి తెలుగు వాచకాలు ఇవ్వాల్సి ఉంది. మిగతా పుస్తకాలు త్వరలోనే రానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే, యూనిఫాంలు కూడా సిద్ధమవుతున్నాయి.



ఆటోలో పాఠశాలలకు తరలిస్తున్న పాఠ్యపుస్తకాలు

పాలకుల సమన్వయ లోపం!



సమీక్షలో పాల్గొన్న సబితారెడ్డి, అధికారులు

- అధికారులు సేమ్.. రివ్యూలు రెండు
- బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో వింత పరిస్థితి

బడంగ్‌పేట్: పాలకుల మధ్య సమన్వయం లోపం కారణంగా సోమవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి క్యాంప్ ఆఫీస్‌లో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అలాగే, మేయర్ చిగురింత పారిజాతరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్, అధికారులతో కలిసి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. గతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన పనుల పురోగతి గురించి ఆరా తీశారు. ముఖ్యంగా హెచ్ఎండీఏ, ఎస్ఎన్‌డీపీ నాలాలు, మెయిన్‌రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు, స్ట్రీట్ లైటింగ్, తాగునీరు. ఇతర మౌలిక వసతుల గురించి చర్చించారు. అలాగే, మేయర్ పారిజాత అధికారులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది రూ. 40 కోట్లతో చేసిన తీర్మానంలో ముఖ్యంగా రూ.12 కోట్లు డ్రైనేజీలకు, రూ.10 కోట్లు బీటీ రోడ్లకు, రూ.2 కోట్లు, కమ్యూనిటీ హాళ్ల కోసం రూ.1.70 కోట్లు, కేటాయించామన్నారు. ఇప్పటికే రూ.12 కోట్లు టెండర్ ప్రక్రియ పూర్తి అయింది. త్వరలోనే పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేరుకుపోయిన నాలాలను వెంటనే శుభ్రం చేయాలన్నారు. ఈ రెండు సమీక్షా సమావేశాల్లో చర్చించిన అంశాలు వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగా అధికారులను అప్రమత్తం చేయడం, అభివృద్ధి పనులపై చర్చించనట్లు తెలిపారు. ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాత చెరొక పార్టీల్లో ఉండటం వల్లనే వేర్వేరుగా రివ్యూలు జరిగినట్లుగా తెలుస్తుంది.



అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్న మేయర్ పారిజాత

సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజావాణిలో సమస్యపై వినతిపత్రం స్వీకరిస్తున్న డీసీ యాదయ్య

ఎల్బీనగర్: ప్రజావాణిలో స్వీకరించిన సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 6 ఫిర్యాదుల రాగా అందులో టౌన్ ప్లానింగ్ మూడు, ఇంజనీరింగ్ రెండు, పార్కులపై 1 ఫిర్యాదు వచ్చాయని పంకజ తెలిపారు.

హయత్‌నగర్ సర్కిల్లో నాలుగు..

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మొత్తం నాలుగు ఫిర్యాదులు వచ్చాయని సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య తెలిపారు.అందులో టౌన్ ప్లానింగ్ పై మూడు, ఫించన్లపై ఒక్క ఫిర్యాదు అందాయని అయన తెలిపారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శ్రీ పురం కాలనీ ఫేజ్ 2 కాలనీ వాసులు తమ కాలనీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.ప్రధానంగా కాలనీలో అనుమతి లేకుండా సెల్లర్ల నిర్మాణం, రోడ్లను అక్రమించి భవనాల నిర్మాణం చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ అధ్యక్షులు కాల్వా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పాశం విఠల్‌రెడ్డి, కోశాధికారి కొప్పుల జంగయ్యగౌడ్, ఉపాధ్యక్షులు సికిందర్, సభ్యులు బాకారం నర్సింహ్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సామ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కార్యాలయంలో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ పంకజ

ఉద్యోగ భద్రత కల్పించండి

మున్సిపల్ కమిషనర్‌కు బిల్ కలెక్టర్ల వినతి

ఇబ్రహీంపట్నం: చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమ జీతాలను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదిబట్ల మున్సిపల్ బిల్ కలెక్టర్స్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీగా ఆవిర్భవించక ముందు నుంచి గ్రామ పంచాయతీల్లో బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్నాం... మున్సిపాలిటీగా మారిన తర్వాత మా పరిస్థితులు మారుతాయని భావిస్తే అందుకు భిన్నంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 10 నుంచి 30 సంవత్సరాల సీనియార్టీతో పలువురు పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత కొరవడిందని... గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు పర్వతాలు, రాజశేఖర్, నరేందర్, సురేష్, రవీందర్, మల్లికార్జున్, స్వామి, మల్లారెడ్డి, సదానంద్ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకేళ్లినట్లు వారు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిల్ కలెక్టర్లు

ఎక్కడి చెత్త అక్కడే..

ఇబ్బందుల్లో కాలనీవాసులు

హస్తినాపురం: జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో గల నందనవనం కాలనీ, ఆదర్శనగర్‌కాలనీ, ఇంద్రసేనారెడ్డినగర్ తదితర ప్రాంతాలలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇండ్లమధ్యనే చెత్త పేరుకుపోయిందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది పేద కుటుంబాలు నివసించే ఈ ప్రాంతంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ ప్రాంతంలో పేద ప్రజలు నివసిస్తున్నారనే చిన్నచూపుతో అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయాప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరకాలంగా తమ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని తాము తమ గోడును ఎవరికి చెప్పుకున్నా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని వాపోతున్నారు. ఎంత మంది అధికారులు మారినా, తమ సమస్యలు మాత్రం అదేవిధంగానే ఉన్నాయని పేదప్రజలు ఇక్కడ నివసిస్తున్నందునే ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందనవనం కాలనీ, ఆదర్శనగర్‌కాలనీ తదితర ప్రాంతాలలో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలు తెప్పలుగా ఉండడంతో దోమలు చేరి తమకు అంటువ్యాధులు సోకుతున్నాయని ఇప్పటికైనా ఎల్బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఆయాకాలనీల ప్రజలు కోరుతున్నారు.



నందనవనంకాలనీలో పిచ్చిమొక్కలు



హస్తినాపురంలోని నందనవనం కాలనీలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కెకె రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సిరీస్, ఎల్‌బీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు

ఎంపీడీఓ శైలజ



ఘట్టుపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: నర్సరీలో నాటిన మొక్కలను సంరక్షించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ శైలజ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామంలో ఉన్న నర్సరీలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో మొక్కలను పెంచాలన్నారు. నర్సరీలో అన్ని రకాల మొక్కలను నాటాలన్నారు. మొక్కలకు నల్లరేగడి మట్టి, పశువుల ఎరువులు చల్లాలని సూచించారు. మొక్కల పెంపకంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ప్రమీళ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



రావిర్యాల పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ శివకుమార్

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదువుకొని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కౌన్సిలర్ వై.శివకుమార్ సూచించారు. గురువారం రావిర్యాల బాలుర, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా పుస్తకాలు, నోటు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని రకాల వసతులను కలిపిస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రఘు, సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి



తుమ్మలూరులో ఉపాధ్యాయురాలికి వేతనం అందజేస్తున్న అమనగంటి ప్రశాంత్‌రెడ్డి

మహేశ్వరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో బీఈడీ చదివిన ప్రైవేట్ ఉపాధ్యాయురాలిని నియమించి తన సొంత నిధులతో రెండు నెలల వేతనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేరని తన దృష్టికి రావడంతో తన సొంత నిధులు వెచ్చించి టీచర్‌ను నియమించి వేతనం ఇస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో)... టమాటా 41, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 65, కాకర 45, బీర 65, క్యాబేజీ 21, ఫ్రెంచి బీన్స్ 115, క్యారెట్ 40, దొండ 26–28, చిక్కుడు 45, గోకర 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 60, ఆలు 35, దోస 25, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 40. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

‘గృహజ్యోతి’ కొందరికే..!

200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే వారికి జీరో బిల్లు వస్తుందని ప్రభుత్వం ప్రకటించినా..కొందరికే పరిమితమైంది. పలువురికి నేటికీ పాత పద్ధతిలోనే బిల్లులు వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

అర్హులందరికీ అందని ‘జీరో’ బిల్లులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ (ఫైల్)

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు గృహజ్యోతి పేరిట ఉచిత్ విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకం గ్రామాల్లో సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. అధికారుల అలసత్వంతో కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరుతోంది. విద్యుత్ అధికారులు అర్హులైన వారికి సైతం పాత పద్ధతిలోనే బిల్లులు వేస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

200 యూనిట్ల లోపు...

ప్రస్తుత ప్రభుత్వం 2023 డిసెంబర్ 28 నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన చేపట్టింది. గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ద్వారా మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత వంటి పథకాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హులైన లబ్ధిదారులకు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పథకాలను అమలు చేయడం ప్రారంభించారు. అందులో గృహజ్యోతి పథకం కింద ఒక్కో గృహానికి 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తే జీరో బిల్లు ఇస్తున్నారు. కాగా మండలంలో దాదాపుగా 16 వేల వరకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో సుమారుగా 11 వేల వరకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న గృహాలు కూడా ఉన్నాయి. కాగా ఈ నెల గ్రామాల్లో దాదాపుగా 7వేల వరకు గృహాలకే జీరో బిల్లు ఇచ్చినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మిగతా మూడు వేలకు పైగా ఉన్న గృహాలకు ఎప్పటిలాగానే బిల్లులు అందజేశారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుని జీరో బిల్లులు రాని వారు అటు విద్యుత్, ఇటు ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడికి వెళ్లిన వారికి అధికారుల నుంచి సరైన సమాధానం రావడంలేదు. సమస్యకు కారణం ఆన్‌లైన్ నమోదులో సిబ్బంది చేసిన పొరపాటేనని అధికారులు భావిస్తున్నారు. వాటిని సరిచేయడానికి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోడంతో లబ్ధిదారులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. విద్యుత్ కార్యాలయానికి వెళితే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాలని, అక్కడికి వెళితే విద్యుత్ కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అర్హులు కోరుతున్నారు.

మాకు రాలేదు..



మా తండ్రి పేరుపై ఉన్న కనెక్షన్‌కు ప్రజా పాలనలో దరఖాస్తు చేశాం. ప్రతినెలా మాదిరిగానే బిల్లు వచ్చింది. అర్హత ఉన్నా జీరో బిల్లు ఎందుకు ఇవ్వలేదో తెలియడంలేదు. మా గ్రామంలో చాలా మంది ఇళ్లకు జీరో బిల్లు వచ్చింది. విద్యుత్ అధికారులను అడిగితే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాలని చెప్పారు. అక్కడ అడిగితే మాకు తెలియదంటున్నారు.

– అశోక్, లబ్ధిదారుడు, పులిమామిడి

తెలియదంటున్నారు..



మేము ప్రజా పాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకం కింద గత డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నాం. ఈ నెల మా గ్రామంలో చాలా మందికి జీరో బిల్లులు వచ్చాయి. మేము 144 యూనిట్లే వాడుకున్నాం. అయినప్పటికీ మాకు ప్రతి నెలా మాదిరే బిల్లు వచ్చింది. అధికారుల్ని అడిగితే తమకు తెలియదంటున్నారు.

– యాదగిరి, లబ్ధిదారుడు, నేదునూరు

ఎస్ఎన్‌డీపీ పనులు వేగంగా పూర్తి చేయండి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎస్ఎన్‌డీపీ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఎస్ఎన్‌డీపీ పనులపై గురువారం ఎమ్మెల్యే అధికారుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఎన్‌డీపీ పనుల కోసం గతంలో రూ.193 కోట్లు మంజూరు చేయగా, ఎస్ఎన్‌డీపీ ఫేజ్– 2 పనుల్లో భాగంగా మరికొన్ని తీవ్రమైన సమస్యలు గుర్తించి మరో రూ.23 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కొన్నిచోట్ల స్థానిక నాయకులు అధికారులను వేధిస్తూ పనులు ముందుకు సాగకుండా చేస్తున్నారని, పనులు పూర్తి కాకపోతే వర్షా కాలంలో ఇళ్లలోకి నీరు వస్తే ఆ నెపాన్ని ఎమ్మెల్యేపై నెట్టి వేయాలనుకొనే ధోరణి మార్చుకోవాలని హితవు పలికారు. ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తైతే నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. పనులు జరగాకుండా ఎవరైన అధికారులను అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణ, కార్తీక్, హేమునాయక్, కిరణ్, రఫీ, నాయకులు సత్యం చారి, శ్రీనివాస్, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి చంద్రమౌళేశ్వర ఆలయ వార్షికోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అలకాపురిలోని శ్రీ శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ సప్తాదశ వార్షికోత్సవాలు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని శృంగేరి శంకర మఠ బ్రాంచ్ అధికారి కొవ్వడి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాల సందర్భంగా ఆలయలంలో మహాకాళి అలంకరణ, చండీ పారాయణం, సామూహిక కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీ ఆదర్శ్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు, ఎల్‌బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కబ్జాదారుల నుంచి ముడుపులు తీసుకుని అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమితో పాటు పేదలు నివసించే ప్రాంతంలో ఉన్న రోడ్డును సైతం ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా అడ్డుకోవడం లేదని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్ర మంత్రులకు బీజేపీ నేతల శుభాకాంక్షలు

మలక్‌పేట: మలక్‌పేట బీజేపీ నేతలు గురువారం ఢిల్లీకి తరలి వెళ్లారు. కేంద్ర మంత్రులుగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు గురువారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మలక్‌పేట నుంచి వెళ్లిన పలువురు బీజేపీనేతలు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను సన్మానించిన వారిలో మూసారంబాగ్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొప్పుల దినేష్, సీనియర్ నాయకులు బొక్క మధుసూదన్ రెడ్డి, నవీన్ రెడ్డి తదితరులు మంత్రులను సన్మానించిన వారిలో ఉన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

చంపాపేట: నిరంతర యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని గురు నిలయ ఫౌండర్, శ్రీస్వధర్మ యోగి ఇస్మాయిల్ గురూజీ అన్నారు. గురువారం చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీలోని లోటస్ ల్యాబ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మోకాళ్లు, కీళ్లు, నడుం వంటి దీర్ఘకాలిక నొప్పులు ఉన్నవారు బౌద్ధ సన్యాసులు అందించిన హైడాలజిన్ అనే యోగా సాధనతో ఇట్టే నయం చేయవచ్చని అన్నారు. యోగా కేంద్రంలో ప్రతి రోజు యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, క్రమం తప్పకుండా సాధనకు హాజరు కావాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన



పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్ యాదవ్

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అత్యున్నతమైన విద్యా బోధన సాగుతోందని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారంలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది ఉన్నత పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు, యూనిఫారంలు అందిస్తోందన్నారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, పీటర్, దినేష్, నాయకులు కేశిరెడ్డి పద్మారెడ్డి, రావుల శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి, మనోజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను గురువారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల ప్రహరీ కూలిన విషయాన్ని కలెక్టర్, డీఈఓల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సరిత, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, నాంపల్లి మహేందర్, భీమనపల్లి సిద్ధు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి సేవా ధార్మిక్ అవార్డు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి ప్రఖ్యాత లతా రాజా ఫౌండేషన్ నేషనల్ సేవా ధార్మిక్ అవార్డును అందజేసింది. దేశంలో బడుగు బలహీన వర్గాల వారికి, మానసిక, శారీరక వికలాంగులకు, అనాథ, నిరుపేదలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా నాలుగు సంస్థలకు నేషనల్ సేవా ధార్మిక్ అవార్డును ప్రకటించారు. అందులో భాగంగా గురువా రం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు, పారిశ్రామికవేత్త శ్రీనివాస్ రావు చేతుల మీదుగా అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు నేషనల్ సేవా ధార్మిక్ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. లతా రాజా ఫౌండేషన్ చైర్మన్ కేకే రాజా పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

మహేశ్వరం జోన్ అదనపు డీసీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న అదనపు డీసీపీ సత్యనారాయణ

పహాడీషరీఫ్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మహేశ్వరం జోన్ అదనపు డీసీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఎస్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. మత్తులో మనిషి విచక్షణ కోల్పోతారన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రతిఒక్కరూ సైబర్‌క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



శంకర్‌పల్లి: విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని శ్రీరాంనగర్ ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాంరెడ్డి చేతులమీదుగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఉచితంగా అందజేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, రవి, ఉమాదేవి, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ వినోద, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

శంకర్‌పల్లి: విద్యార్థులు కష్టపడి చదివి తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. గురువారం శంకర్‌పల్లి మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆమె అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పింస్తోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్వేత, హెచ్ఎం ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కళాకారులు

కందుకూరు: తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం కళాకారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాలికి గజ్జ కట్టి, గోసి గొంగడేసి గ్రామ గ్రామాన తిరిగి ఉద్యమంలో గొంతెత్తి ధూంధాం లాడిన ఆట గొంతులు మూగబోతున్నాయన్నారు. గ్రామీణ కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. ఉద్యమ సమయంలో రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లో తిగిరి తెలంగాణ ఆవశ్యకతను తెలియజేస్తూ, రాష్ట్రం సాధిస్తే మనకు చేకూరే ప్రయోజనాలు, లాభాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశామన్నారు. గత ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగంతో పాటు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఎంతో మంది ఉద్యమంలో పని చేసిన కళాకారులకు తినడానికి కనీసం తిండి, ఉండటానికి ఇల్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు ధన్నారం జంగన్న, శివకుమార్, కిరణ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

హెచ్ఎం జయమ్మ

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగులు తమ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని హెచ్ఎం జయమ్మ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ జెడ్పీ హెచ్ఎస్‌లో తొమ్మిది సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాధిక పదోన్నతిపై నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రాధికను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ.. బోధనలో రాధిక ఉత్తమ ప్రతిభను కనబరిచి విద్యార్థులు, తల్లితండ్రుల మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందిన రాధిక భవిష్యత్‌లో మరెన్నో పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించడం అభినందనీయం

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడం సంతోషించదగ్గ విషయమని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును ఎస్‌టీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులకు స్వాగతం పలుకుతూ సన్మానించారు. హిమాయత్‌నగర్ పాఠశాలలో పని చేసిన అనంతరెడ్డి గత సంవత్సరం నవంబర్ నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎంగా కొనసాగింది. ప్రస్తుతం ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడంలో భాగంగా మేడ్చెల్ జిల్లా వెంకటాపూర్ యూపీహెచ్ పాఠశాలలో 2018 నుంచి ఈరోజు వరకు పని చేసిన ఆయన ఏడు సంవత్సరాల పాటు ఉపాధ్యాయులుగా కొనసాగారు. ప్రభుత్వం పదోన్నతి కల్పించిన వారిలో ఈ పాఠశాల ఉపాధ్యాయుడు ఆంజనేయులుకు హెచ్ఎంగా పదోన్నతి కల్పించడంతో గురువారం హిమాయత్‌నగర్ పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పోస్టు రావడంతో బాధ్యతలు మరింత పెరిగాయన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థుల అభివృద్ధికి, పాఠశాల బలోపేతానికి తోటి ఉపాధ్యాయులతో కలిసి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యాయులు అరుణ, కళావతి, మంజుల, బిలాల్, గోవర్ధన్, నీలిమ, మమత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.